క్లుప్తంగా

బాలుర గృహానికి కెనరా బ్యాంక్ వితరణ



గృహం ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌కు ఫ్రిజ్ అందిస్తున్న బ్యాంక్ మేనేజర్ సతీష్ ఆదిరెడ్డి

ఆరిలోవ: చినగదిలి దరి దీన్‌దయాల్‌పురంలో ప్రభుత్వ బాలుర గృహానికి కెనరా బ్యాంక్ రిఫ్రిజిరేటర్ అందించింది. శనివారం గృహాన్ని సందర్శించిన కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ సతీష్ ఆదిరెడ్డి గృహం ఇన్‌చార్జి పర్యవేక్షణాధికారి పి.రమణ, సిబ్బందికి దానిని అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గతంలో మేనేజర్ సతీష్ ఇక్కడకు వచ్చినప్పుడు నిల్వ ఉన్న కూరగాయలు పాడవడం గమనించి, ఫ్రిజ్‌ను అందించారన్నారు. గృహంలో బాలుర తరఫున బ్యాంక్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గృహం సిబ్బంది పాల్గొన్నారు.

‘పర్యావరణ హితంగా జీవించండి’



ఎకో వైజాగ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: ‘పర్యావరణ హితంగా జీవించండి.. ప్రకృతి వనరులను కాపాడండి’ అని గ్రీన్‌క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పిలుపునిచ్చారు. ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా చిన్నవాల్తేరు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్లకార్డులను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తాము ఆరగించిన మామిడి, సపోటా, సీతాఫలం, నేరేడు వంటి ఫలాల విత్తనాలను ఆరబెట్టి, వర్షాలు కురిసే సమయంలో కొండలపై, ఇతర మైదానాల్లో, రహదారుల పక్కన చల్లాలన్నారు. తద్వారా అవి మొలకెత్తి, మొక్కలుగా వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వనిత తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో రూ.60కు కిలో శనగపప్పు



వినియోగదారులకు శనగపప్పు అందజేస్తున్న రైతు బజార్ ఈవో ప్రసాద్

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌లో కేంద్ర ప్రభుత్వం ఏపీ మార్కెట్ ద్వారా సరఫరా చేసిన భారత్ దాల్ శనగ పప్పు కిలో రూ.60కు అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతు బజార్‌లో శనివారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, ఈవో ప్రసాద్ వినియోగదారులకు శనగపప్పు అందించారు. ఆయన మాట్లాడుతూ శనగపప్పు కావాల్సిన వినియోగదారులు ఆధార్ కార్డు తీసుకు రావాలని సూచించారు. ఆధార్ కార్డుపై రూ.60 చొప్పున 3 కిలోలు ఇస్తారని తెలిపారు. ఈ ప్రత్యేక కౌంటర్‌తో పాటు ఇక్కడ సూపర్ బజార్ గృహమిత్ర కౌంటర్‌లోనూ ఇదేరకం శనగపప్పు విక్రయిస్తారని చెప్పారు. అక్కడ కూడా ఆధార్ కార్డు తప్పనిసరి అని తెలియజేశారు.

బల్లిగిరి వెంకన్నకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే స్వామి దర్శనానికి బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

సైన్యం.. ‘సిద్ధం’

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భీమిలిలోని సంగివలసలో పూరించనున్న ఎన్నికల శంఖారావ సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ స్థాయిలో తరలి వెళ్లాయి. నియోజకవర్గం పరిధి పలు ప్రాంతాల నుండి బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై చీమల బారులను తలపిస్తూ పయనమయ్యారు. దీంతో దారులన్నీ భీమిలి వైపే సాగాయి. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు, అభిమానులకు దిశా నిర్దేశం చేస్తూ ఉత్సాహంగా అందరినీ తీసుకుని సీఎం సభాస్థలికి బయలుదేరి వెళ్లారు.



పదమూడో వార్డు నుంచి సీఎం సభకు బయలుదేరిన కార్పొరేటర్ సునీత, నాయకులు

- ‘సిద్ధం’ సభకు భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- కదనోత్సాహంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సందడి



పదకొండో వార్డు నుంచి బైక్‌లపై తరలి వెళ్తున్న యువకులు

ఆరిలోవ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించేందుకు భీమిలి దరి సంగివలసలో శనివారం ఏర్పాటు చేసిన ‘సిద్ధం’ సభకు తూర్పు నియోజవకర్గం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాయి. బస్‌లు, ఆటోలు, టాటా మేజిక్‌లు, బైక్‌లపై ర్యాలీగా వెళ్లడంతో నియోజకవర్గంలో పండగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో 15 వార్డుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, నాయకులు వైఎస్సార్‌సీపీ జెండాలతో నాయకులు, కార్యకర్తలు సందడి చేశారు. ప్రతి వార్డు నుంచి కార్యకర్తలు స్వచ్ఛందంగా బయలుదేరి జగనన్నపై అభిమానం చాటుకున్నారు.



జెండా ఊపి బస్సులను పంపిస్తున్న పీతల గోవింద్

● తొమ్మిదో వార్డులో..

తొమ్మిదో వార్డులో కార్పొరేటర్ స్వాతి ఆధ్వర్యంలో బస్‌లు, బైక్‌లపై నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాలు పట్టుకుని సభకు బయలుదేరి వెళ్లారు. విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెంలో ర్యాలీగా బయలుదేరారు.

● పదో వార్డులో..

పదో వార్డులో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బొండా శ్రీనివాస్, కె.ఎస్. చలం తదితరుల ఆధ్వర్యంలో రవీంద్రనగర్, ఆదర్శనగర్, ఇందిరానగర్ నుంచి బస్‌లు, బైక్‌లపై వారంతా పార్టీ జెండాలతో సందడిగా బయలుదేరారు.



అప్పుఘర్ నుంచి ద్విచక్ర వాహనాలపై తరలి వెళ్తున్న కార్యకర్తలు, నాయకులు



పన్నెండో వార్డులో నినాదాలు చేస్తున్న కార్పొరేటర్ రోహిణి, నాయకులు

● పదకొండో వార్డులో..

పదకొండో వార్డు నుంచి నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కార్యకర్తలు బయలుదేరారు. వార్డులో నాయకులు, కార్యకర్తలు బస్‌లు, టాటా మేజిక్‌లు, బైక్‌లపై వార్డులో బాలాజీనగర్ నుంచి బయలుదేరి పెదగదిలి, హనుమంతవాక మీదుగా తరలి వెళ్లారు.

● పన్నెండో వార్డులో..

పన్నెండో వార్డు నుంచి కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో బస్‌లు, బైక్‌లపై సభకు బయలుదేరారు. వార్డులో నాయకులు, కార్యకర్తలు చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి బయలుదేరి పెదగదిలి, హనుమంతవాక మీదుగా తరలి వెళ్లారు.



పదో వార్డు నుంచి తరలి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

● పదమూడో వార్డులో..

పదమూడో వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో బస్‌లు, బైక్‌లపై సంగివలస సిద్ధం సభకు బయలుదేరారు. వార్డులో నాయకులు, కార్యకర్తలు కలిసి ఆఖరి బస్ స్టాప్ వద్ద వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి దీన్‌దయాళపురం, చినగదిలి, హనుమంతవాక మీదుగా తరలి వెళ్లారు.

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర ఎన్నికల శంఖారావానికి జీవీఎంసీ 17, 18, 19 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బస్సులతో పాటు ద్విచక్ర వాహనాలపై పెద్ద ఎత్తున ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. తమ ప్రియతమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావాన్ని విశాఖ జిల్లా నుంచి ప్రారంభించడంపై పలువురు కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. జగనన్న కోసం, వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శ్రమించడానికి తామంతా సిద్ధమంటూ నినాదాలు చేశారు.

● 17వ వార్డు నుంచి బయల్దేరుతున్న బస్సులు, ద్విచక్ర వాహనాల ర్యాలీని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు.



సభకు బయల్దేరుతున్న బస్సును ప్రారంభిస్తున్న గేదెల నాగరాజు



బైకులపై ర్యాలీగా వెళ్తున్న 28వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

● 18వ వార్డులోని అప్పుఘర్‌లో వార్డు కార్యకర్తలు, నాయకులు ద్విచక్ర వాహనాలపై భారీగా తరలి వెళ్లారు. వార్డు నాయకుడు పుక్కళ్ల శంకర్, వాసుపల్లి ఎల్లాజీ, సతీష్ తదితరులు ఈ ర్యాలీలను ప్రారంభించారు.

● 19వ వార్డు జాలరిపేటలో వార్డు నాయకుడు సూరాడ దాసు సభకు హాజరయ్యే పార్టీ శ్రేణుల ర్యాలీలను ప్రారంభించారు.

సీఎం సభకు తరలిన ఊరూవాడా..

బీచ్‌రోడ్డు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభకు ఊరూవాడా తరలి వెళ్లింది. బైకులు, కార్లు, ఆటోలు, బస్సుల్లో అభిమానులు, పార్టీ శ్రేణులు సభకు తరలి వెళ్లి సీఎం ప్రసంగం విని పులకించిపోయారు.

వందల బైకులతో ర్యాలీ..

జీవీఎంసీ 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో వార్డులో యువకులు వందల బైకులతో ర్యాలీగా సీఎం సభకు వెళ్లారు. మార్గం మొత్తం సమరానికి సిద్ధం.. ఆంధ్రాకి మళ్లీ జగనే సీఎం కావాలి అంటూ నినదించారు.

బస్సుల్లో తరలిన జనం..

జీవీఎంసీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో వార్డులోని ప్రజలు బస్సుల్లో సీఎం సభకు తరలి వెళ్లారు. సీఎం ప్రసంగం విని ఉత్సాహంగా ఇంటికి చేరుకున్నారు.

దేవాలయాలపై అధ్యయన వివరాలు నేడు వెల్లడి

ఏయూలో సమావేశం

మహారాణిపేట : ప్రఖ్యాత సినీ గేయ రచయిత, తెలుగు వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు నేతృత్వంలో కొంత మంది భక్త చైతన్యవంతుల బృందం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల చరిత్రలను అధ్యయనం చేస్తోంది. పలు దేవాలయాల నిర్మాణం వెనుక పెద్దల కృషి, దాతల దాతృత్వం, దేవాలయాలకు సంక్రమించిన ఆస్తులు, వాటి నిర్వహణ తీరులో జరుగుతున్న అపచారాలు, కావాలని దేవాలయాల ఆస్తులను కొల్లగొడుతున్న తీరుతెన్నులు, కైంకర్యమైపోతున్న దేవాలయాల ఆస్తిపాస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఈ బృందం తమ అధ్యయన విశేషాలను రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజలకు తెలియజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా ఆదివారం సాయంత్రం మద్దిలపాలెం జంక్షన్ సమీపంలో గల డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఒక సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ పూర్వ ముఖ్య కార్యదర్శి ఎల్.వి.సుబ్రహ్మణ్యం, విశిష్ట అతిథులుగా విజయ్ నిర్మాణ్ సంస్థ అధినేత సూరపనేని విజయకుమార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రఖ్యాత పద్యకవి వామరాజు సత్యమూర్తి, అవధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, సంస్కృతాంధ్ర పండితులు పీటీజీవి రంగాచార్యులు, సాహితీవేత్త నేమాని మంజునాథ శర్మ, సీనియర్ జర్నలిస్టు జీవీఎస్ మూర్తి పాల్గొంటారు. సూరంపూడి వీరభద్రరావు సభాధ్యక్షులుగా వ్యవహరించే ఈ కార్యక్రమానికి పతంజలి యోగా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వేదభాస్కరం కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఘట్టి శ్రీ విద్య బృందంచే భక్తి సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి అర్చకులు అంతా తరలి రావాలని ఉత్తరాంధ్ర అర్చక సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తలంక మురళీకృష్ణ తెలిపారు.

ఈకార్వో వితరణ

రైల్వే హాస్పిటల్‌కు ఫొటోథెరపీ యూనిట్ అందజేత



ఫొటోథెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఈకార్వో ప్రతినిధులు, డాక్టర్ తిరు అరుళ్ జోతి

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే హాస్పిటల్‌కు ఈస్ట్ కోస్ట్ రైల్వే వుమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో), వాల్తేర్ సభ్యులు నవజాత శిశువులకు ఉపయోగపడే పరికరాన్ని వితరణ చేశారు. రైల్వే హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్(సీఎంఎస్) డాక్టర్ తిరు అరుళ్ జోతి సమక్షంలో దీనిని అందజేశారు. ప్రస్తుత కాలంలో నూతనంగా జన్మించిన శిశువులకు సర్వసాధారణంగా వచ్చే నియోనటల్ జాండిస్ నుంచి మొదటి వారంలో సంరక్షణ ఇచ్చేందుకు ఈ ఫొటోథెరపీ యూనిట్ ఉపకరిస్తుందని ఈకార్వో సభ్యులు తెలిపారు. దీని వల్ల ఇటువంటి వారిని వేరే ఆస్పత్రులకు తరలించాల్సిన అవసరం లేకుండా రైల్వే హాస్పటల్‌లోనే చికిత్సం అందించవచ్చన్నారు. ఈ హాస్పిటల్‌లో నెలకు సగటున 15–20 ప్రసవాలు జరుగుతున్నాయని, ఈ పరికరం వల్ల మరింత మంది పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఈకార్వో కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఈకార్వో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్స్ మధుస్మిత సాహూ, కవితా గుప్తా, ఈకార్వో ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి



సదస్సులో పాల్గొన మార్వాడీ సమాజ్ మహిళలు

అల్లిపురం : సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు అఖిల భారత మార్వాడీ సమాజ్ సంఘం కృషి చేస్తుందని సంఘం జాతీయ అధ్యక్షురాలు నీరు తెలిపారు. నగరంలో ఒక హోటల్లో శనివారం విశాఖ నగరంలోని మహారాష్ట్ర మండల్ నేషనల్ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో గ్రామస్థాయి నుంచి ప్రజలకు సామాజిక సేవ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. దీంట్లో భాగంగా ప్రతి ఏటా రాష్ట్రస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా మార్వాడీ మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుంచి మహిళలు, సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న టెక్‌ఫెస్ట్, మోడల్ ఎక్స్‌పో



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా శనివారం నిర్వహించిన టెక్ ఫెస్ట్, మోడల్ ఎక్స్‌పో ఆకట్టుకున్నాయి. సివిల్, సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, బీఎస్ అండ్ హెచ్ అన్ని సాంకేతిక విభాగాలు అనేక నమూనాలు ప్రదర్శించాయి. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ప్రిన్సిపాల్స్‌తో ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈఈఈ విభాగం విద్యార్థులు తయారు చేసిన ఇంగ్లిష్ క్లాస్ రూమ్, ఎలక్ట్రిక్ కార్‌ను ఆయన ప్రారంభించి అభినందించారు. నగరంలోని పలు పాఠశాలలు, ఇంటర్ కళాశాల విద్యార్థులు పాల్గొని నమూనాలు తిలకించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

వేడుకగా తాజుద్దీన్ బాబా జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శనివారం హజ్రత్ తాజుద్దీన్ బాబా రహమతుల్లా అలైహి వసల్లం 163వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ముస్లింలు, చిన్నారులు నమాజ్‌లు ఆచరించి మసీదు ప్రాంగణంలో ఖురాన్ పఠించి, ఫాతేహ నిర్వహించి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆ ప్రాంతంలో దావత్ నిర్వహించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా, కార్యదర్శి అన్సర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం




జయప్రభాశర్మను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

మురళీనగర్: వనితా వాకర్స్ క్లబ్ ద్వారా ప్రజలకు విశేష సేవలందించిన క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వనితా భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చేసిన సేవలను సభ్యులు కొనియాడారు. తనను సత్కరించిన సభ్యులకు ప్రభాశర్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరి ప్రభావతి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపు

మద్రిపాలెం: శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య అందిస్తున్న సేవలను గుర్తించి, సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. 50వ వార్డు మాధవధారకు చెందిన సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ స్వామి అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలకు గానూ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రం, జ్ఞాపికను ఈవో శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా ఆయనకు అందజేశారు.

ఘనంగా తెలుగు వికీపీడియా వార్షికోత్సవం



వికీపీడియా కండువాలతో సభ్యులు

దాబాగార్డెన్స్ : అంతర్జాల విజ్ఞాన సర్వస్వమైన తెలుగు వికీపీడియా వార్షికోత్సవం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ విజ్ఞాన సృష్టి పేరుతో ఏర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో వికీపీడియా సభ్యులు ఎం.వి. నాయుడు, డాక్టర్ మామిడి హరికృష్ణ, ఆదిత్య కందర్ప, కాకర్ల సజయ తదితరులు పాల్గొని తెలుగులో విజ్ఞానం అందించడంపై చర్చించారు. విజ్ఞానానికి పరిధులు లేవని, అది ఎప్పటికీ మార్పు చెందదన్నారు. తెలుగు సాహిత్యాన్ని భద్రపరిచే ప్రయత్నం చేయాలన్నారు. తెలుగు వికీపీడియా సభ్యులు తుమ్మల శిరీష్‌కుమార్, రాజశేఖర్, వీనస్, పవన్ సంతోష్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యానిమల్ కీపర్ కుటుంబానికి జూ కార్మికుల చేయూత



మృతుడి తల్లికి నగదు అందజేస్తున్న జూపార్కు కార్మికులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రమాదవశాత్తు మృతి చెందిన యానిమల్ కీపర్ కుటుంబానికి సహ కార్మికులు ఆర్థిక సాయం అందించారు. రెండు నెలల క్రితం ఎలుగుబంటి దాడిలో యానిమల్ కీపర్ నగేష్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీంతో జూపార్కులో నగేష్‌తో పాటు పనిచేస్తున్న తోటి కార్మికులు వారి కుటుంబానికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చారు. అందరూ కలిసి రూ.43వేలు సమకూర్చారు.ఆ నగదును సీఐటీయూ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఆరిలోవ జోన్ నాయకుల సమక్షంలో మృతుడు నగేష్ తల్లికి శనివారం జూ ప్రధాన ద్వారం వద్ద అందజేశారు. దీంతో నగేష్ తల్లి, కుటుంబ సభ్యులు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

1080వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: మహోన్నతమైన భారత రాజ్యాంగానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. స్వాతంత్ర్యానంతరం ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధి చేసుకున్న ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా ప్రైవేట్‌వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న దీక్షలు శనివారానికి 1080వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించే వరకు కార్మికుల ఉద్యమం ఆగదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా పార్లమెంట్‌లో అడ్డుకుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని కోరారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉక్కు పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.